# అలక్ష్యం

"నీకు తెలీదా! గీత ఇప్పుడు అమెరికాలో వుంది" మిట్టమధ్యాహ్నం బయల్దేరి, రెండు బస్సులు మారి, అరకిలోమీటరు నడిచి... అక్కడికి చేరిన నాకు ఆ మాటలు శరాఘాతాల్లా తగిలాయి.

"అమెరికానా!" అన్నాను తడారిపోయిన పెదవులతో. గీతా వాళ్ళ అమ్మగారు తెచ్చిచ్చిన మంచినీళ్ళ గ్లాసందుకుని గడగడా తాగి మళ్ళీ వాళ్ళ నాన్నగారివైపు తిరిగాను.

"ఊ. న్యూజెర్సీలో వుంది" లీలగా గర్వం ధ్వనించింది ఆయన గొంతులో.

నా మనసులో వెల్లువలా ప్రశ్నలు పుట్టాయి. ఎలా వెళ్ళింది! ఉద్యోగం వచ్చిందా! పిల్లాడ్ని తీసుకెళ్ళిందా! వాళ్ళాయన ఎక్కడున్నాడు!... వగైరా... వగైరా.

ఏదీ డైరెక్టుగా అడిగే చనువు లేదు. ఎలా అడగాలో తెలీలేదు కూడా. ఒక అయిదు నిమిషాలు స్తబ్ధంగా కూర్చున్నాను. వాళ్ళ అమ్మగారు కాఫీ తెచ్చి ఇచ్చేలోపల మరికొన్ని విషయాలు చెప్పారు వాళ్ళ నాన్నగారు.

ఆ మాటల్లో నా సందేహాలన్నీ తీరిపోయాయి. గీత ఒంటరిగా వెళ్ళలేదు అక్కడికి. వాళ్ళ ఆయనతో కలిసే వెళ్ళింది. ఇంకా చెప్పాలంటే ఆయన తీసుకువెళ్తే ఆయన వెనక వెళ్ళింది.

అతనికి అమెరికాలో ఉద్యోగం వచ్చిందట. తను వెళ్తూ భార్యని కూడా తీసుకువెళ్ళాడట.

మరో పదినిమిషాల తర్వాత వాళ్ల దగ్గర సెలవు తీసుకుని వచ్చేస్తుంటే చాలా నిస్సత్తువగా, దిగులుగా అనిపించింది.

ఎవరినైతే నా ప్రాణం అనుకున్నానో, ఏ వ్యక్తి కష్టసుఖాలు నావిగా ఫీల్ అయ్యానో... అలాంటి వ్యక్తి అంత దూరం వెళ్ళిపోతూ కనీసం నాకు

తెలియపర్చడమైనా చేయలేదనుకుంటే... ఉక్రోషంగా అనిపించింది. మా స్నేహం మీదే అపనమ్మకం కలిగింది.

పది సంవత్సరాల స్నేహం మాది. టెన్త్ అయిపోయి కాలేజ్‌లో అడుగుపెట్టిన సంవత్సరం పరిచయమయింది గీత. పదిహేను పదహారేళ్ళ వయసు... స్వంత భావాలు, ఇష్టాలు, అభిప్రాయాలు ఏర్పర్చుకునే టైం అదే. స్వార్థాలు, స్వప్రయోజనాలు... లాభనష్టాల లెక్కలతో మెదడూ, మనసూ పండిపోని టైమూ అదే. అందుకేనేమో... ఆ వయసులో చేసిన స్నేహాలు చాలా గాఢంగా వుంటాయి.

మా స్నేహమూ అంతే. ఒకళ్ల మనసులోని భావాలు మరొకరికి అద్దంలో చూసినంత కరెక్ట్‌గా అర్థం అయ్యేవి.

దాని కాళ్ళల్లో ముల్లు దిగితే నా కళ్ళల్లో నీళ్ళొచ్చేవి అనడం అతిశయోక్తి అవుతుందేమోకానీ... దానికి అవమానం జరిగినా, ఆనందం కలిగినా... నా హృదయమూ అంతే ఉద్వేగంతో స్పందించేది అనడంలో మాత్రం సందేహం లేదు.

ప్రభుతో దాని పెళ్ళయినప్పుడు... అది వేరే వూరు వెళ్ళిపోవడంతో... మొదటిసారిగా మా మధ్య కొంచెం దూరం ఏర్పడింది.

సంవత్సరం తర్వాత... డెలివరీకి అది పుట్టింటికి వచ్చినప్పుడు రెక్కలు కట్టుకున్నట్లుగా వెళ్లి వాలాను నేను.

మగపిల్లాడు పుట్టాడు. ప్రభు విషయంలో దానికి సంతృప్తి లేదన్న చేదు నిజం తెలిసి నాకు చాలా బాధ కలిగింది.

పిల్లాడ్నెత్తుకుని వెళ్ళాక మళ్ళీ సంవత్సరానికి చూశాను నేను గీతని. అప్పటికి ప్రభు విషయంలో దానికి అసంతృప్తి కాదు, ద్వేషం మొదలయింది.

ఒకరోజు సాయంత్రం... వాళ్ళ అమ్మా వాళ్లింట్లోనే... గిన్నెనిండా సన్నజాజులు కోసుకుని, దారబ్బంతి తీసుకుని మేడమీదికి వెళ్ళి కూర్చున్నాం.

"నేను ఏదయినా జాబ్ చూసుకుని ఫారిన్ వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అంది గీత పళ్ళ బిగువున.

నేను మాల కడుతూ వుంటే... అది పిల్లాడ్ని ఒళ్లో పడుకోబెట్టుకుని కూర్చుని... ఆ మసక వెలుతురులో... దాని మనసును గాయపర్చిన సంఘటనలన్నీ చెప్పింది.

దాని గొంతులో సుళ్ళు తిరిగిన బాధకి నా గుండె పిండేసినట్లయింది. తప్పెవరిదయినా కానీ... ఇంత అసంతృప్తితో, ఇంత బాధతో కుమిలిపోతూ అతని దగ్గర వుండడం అనవసరం అనిపించింది నాకు. అదే మాట అన్నాను దానితో.

అది సాలోచనగా చూస్తుంటే... "కానీ తర్వాత మళ్ళీ బాధ పడకూడదు. నీకు అతనిమీద పూర్తిగా ప్రేమ లేదనుకుంటేనే అలాంటి స్టెప్ తీసుకో" హెచ్చరికగా చెప్పాను.

రెండు నిమిషాలు ఆలోచిస్తూ వుండిపోయింది అది. తర్వాత వణుకుతున్న గొంతుతో చెప్పింది.

"ప్రేమ వుండేది. పెళ్ళి నాటికి చాలా గాఢమయిన ప్రేమే వుండేది. అతన్ని జీవితాంతం సుఖపెట్టాలనీ, అందులోనే నేను ఆనందం పొందాలనీ అనిపించేది. కానీ..." ఒక్క క్షణం ఆగి దుఃఖాన్ని దిగమింగుకుని కొనసాగించింది అది.

"కానీ నాప్రేమని అతను అర్థం చేసుకోలేదు శారదా! ఇంట్లోనుంచి వచ్చేయాలన్నది కూడా నా అంతట నాకు కలిగిన వుద్దేశ్యం కాదు. అతను పదే పదే నువ్వు వున్నా, లేకపోయినా ఒకటే అన్న నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంటే... అక్కడ వుండడం దుస్సహంగా వుంది. 'నా పద్ధతి ఇంతే. నీకిష్టమయితే వుండు. లేకపోతే పో' అని అతను అన్నప్పుడు విపరీతమయిన ఆవేశం వస్తుంది. చచ్చినా అక్కడినుంచి కదలకూడదనిపిస్తుంది. కానీ అక్కడే వుండాలన్నా ఇబ్బందిగా వుంటుంది".

దాని మాటలు నా కళ్ళల్లో నీళ్ళు తెప్పించాయి. పూడుకుపోయిన గొంతుని పెగుల్చుకుని అడిగాను. "వెళ్ళిపో అన్న మాటని అతను నిజంగా అదే వుద్దేశ్యంతో అంటాడా! కోపంలో అనాలోచితంగా అంటాడా!"

నా ప్రశ్నకి అది విరక్తిగా నవ్వింది. "విన్న మాటని విన్నట్లుగా కాకుండా ఇంకోరకంగా ఎలా అర్థం చేసుకుంటాం శారదా! అతని ఉద్దేశ్యం అది కాదేమోలే. అసలు ఆ మాట అతను అనలేదేమోలే... నేనే పొరపాటుగా విన్నానేమోలే... అంటూ ఎలా ఆలోచిస్తాం!" అంది.

నిజమే. అలా ఎలా ఆలోచిస్తాం! అనాలోచితంగా అయితే మాత్రం అతను పదే పదే ఆ మాటని ఎందుకనాలి! చాలా చిత్రమయిన విషయం. మగవాళ్ళు అంత సులభంగా వాడే మాటలని ఆడవాళ్ళు కూడా అంత సులభంగానూ ఎందుకు తీసుకోలేరు! ఇంత గుంజాటన, బాధ ఎందుకు పడతారు!

నా ఆలోచన తెగక ముందే భోజనానికి పిలుపొచ్చింది. తింటూన్నంతసేపూ కూడా ఆలోచిస్తూనే వున్నాను.

భోజనాలయ్యేసరికి నా ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. దాని బాధకి కారణం ఏమిటో... పరిష్కారమేమిటో.. దానికి నేనివ్వాల్సిన సలహా ఏమిటో అన్నీ అర్థమయ్యాయి.

మంచం మీద నడుము వాలుస్తూండగా అడిగాను "ఇద్దరు మనుషులు స్నేహం చేస్తారనుకో. కొన్నాళ్ళు చాలా ప్రేమగా వున్న తరువాత... సడన్‌గా వాళ్ళలో ఒకరికి రెండోవాళ్ళమీద ఇంట్రెస్ట్ పోయిందనుకో. మాట్లాడటం తగ్గించారనుకో... అపుడేమవుతుంది! రెండోవాళ్ళు ఏం చేస్తారు!" అని.

"ఏం చేస్తారు! బాధపడతారు" అంది అది.

"పడి...!" అన్నాను.

"పడి.. వాళ్ళు కూడా అలాగే వుండడం మొదలు పెడ్తారు. మెల్ల మెల్లగా ఈ స్నేహాన్ని వదిలేసి మరోవైపు తమ దృష్టిని మళ్ళించుకుంటారు" అంది.

"కరెక్ట్. అదే పనిని భర్త విషయంలో కూడా చేయచ్చుగా!" అన్నాను పాయింట్ లాగినట్లుగా.

అది చిత్రంగా చూసి "నీ మొహంలా వుంది" అంది. "అదీ ఇదీ ఒకటెలా అవుతుంది!"

"ఎందుకు కాదు!" అన్నాను నేను రెట్టిస్తున్నట్లుగా.

అది సమాధానం చెప్పలేదు. చెప్పడం అనవసరం అన్నట్లు నా వైపు విసుగ్గా చూసి పూరుకుంది.

"ఎందుకంటే అందులో శారీరక సంబంధం లేదు కాబట్టి. ఇందులో వుంది కాబట్టి" అన్నాను మరో పాయింట్ లాగినట్లుగా.

అది నావైపు తిరిగింది. పెద్ద గొప్ప విషయం కనుక్కున్నట్లు ఫోజెందుకు! అన్న ధోరణిలో చూసి "అదే మరి!" అంది. తెలిసి కూడా అడుగుతావే! అన్నట్లుగా.

నేను చాలా జాగ్రత్తగా తర్వాతి ప్రశ్న అడిగాను.

"శారీరక సంబంధం ఇద్దరికీ వుంటుంది కదా! భర్త తీసుకున్నంత ఈజీగా భార్య ఎందుకు తీసుకోదు దాన్ని!"

నా తిక్క ప్రశ్నకి అది మళ్ళీ ఛర్రున చూసింది. నాతో మాట్లాడటం కూడా అనవసరం అన్నట్లు వెల్లకిలా తిరిగి పడుకుంది.

"చెప్పవేంటే!" అన్నాను నేను వదిలిపెట్టకుండా.

"ఏం చెప్పను!" అంది గీత విసుగ్గా.

"నీ బాధకి కారణం ఏదో కోల్పోయానన్న ఫీలింగ్. నువ్వు మోసపోయినట్లూ... తిరిగి తీసుకోలేనిదేదో అతనికి ఇచ్చినట్లూ... ఈ ఫీలింగ్సన్నీ వదిలేసేయి. అపుడు ఇంత బాధ వుండదు" అన్నాను.

"చాలా బాగా చెప్పావులే" అంది గీత వ్యంగ్యంగా. "మా అమ్మ మాట్లాడినట్లే మాట్లాడుతున్నావు. మగవాళ్లు, విసుగుతో సవాలక్ష అంటారు. అవన్నీ పట్టించు కోకూడదు... అని చెప్తుంది మా అమ్మ. దానికీ, నువు చెప్పేదానికీ తేడా ఏముంది! ఆవిడ ఆడపిల్లకి ఆత్మాభిమానం వుండకూడదంటుంది. నువ్వు ఫీలింగ్సే వుండకూడ దంటున్నావు" అంది.

నేను దాని మొహంలోకి సూటిగా చూశాను. "ఫీలింగ్స్ వుండకూడదనడం లేదే! మనల్ని బాధపెట్టే ఫీలింగ్స్‌ని వదుల్చుకోవాలి అంటున్నాను. ఈ శీలమూ, కన్యాత్వమూ... ఈ భావాలన్నిటివల్లా మనకి బాధ తప్ప ప్రయోజనమేముంది చెప్పు!"

నా ప్రశ్న పూర్తవుతూండగానే "ఏమీ లేదు. అది నాకూ తెలుసు" అంది అది కొట్టినట్లుగా.

"మరి ఎందుకు ఆ ఫీలింగ్సే పట్టుకుని వేళ్లాడటం! పైగా వాటిని తీసుకువెళ్ళి ఆత్మాభిమానానికి ముడిపెడ్తావే! ఆత్మాభిమానం అనేది వ్యక్తిత్వానికి వన్నె తెచ్చే లక్షణం. ఈ ఫీలింగ్సేమో పనికిమాలినవి. మన వ్యక్తిత్వాన్ని ఇంకా ఇంకా బలహీన పర్చేవి" నేను కూడా పదునుగానే చెప్పాను.

అది మాట్లాడలేదు. ఆలోచిస్తూ వూరుకుంది. దాన్ని దాని ఆలోచనకి వదిలేసి నేను కామ్‌గా పడుకున్నాను.

రెండు నిమిషాల తర్వాత అది మెల్లగా చెప్పడం మొదలుపెట్టింది. "నువ్వు చెప్పింది నిజమేనే శారదా! అవన్నీ పనికిరాని ఫీలింగ్సే. ఇంకో పదేళ్ళకో, వందేళ్ళకో మనం వదుల్చుకోవాల్సిన ఫీలింగ్సే. కానీ ఇపుడయితే అవి వున్నాయి కదా! అర్హతలేని వ్యక్తికి నా కన్యాత్వాన్ని ధారపోశానన్న దుఃఖం నాకున్నట్లే... నా కన్నెతనాన్ని కొల్లగొట్టానన్న గర్వం అతనిలోనూ వుంటుంది. అతని అంతరాంతరాల్లో ఆ భావం

వుందన్న స్పృహ నన్ను చిరాకుకి గురి చేస్తుంది. అంత అమూల్యమయిన దాన్ని నా నుంచి పొంది ఈ రోజు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడు కదా అనుకుంటే ఉక్రోషం వస్తుంది. వేసిన స్టెప్‌ని వెనక్కి తీసుకోలేని అశక్తత, బాధ కలిగిస్తుంది. ఇదే బాధని అతనికీ కలిగిస్తే కానీ ఉపశమనం దొరకదనిపిస్తుంది. కానీ ఎలా కలిగిస్తాం!" అది నిట్టూర్చింది.

"ఏం చేసినా నాకు కలిగిన ఈ ఫీలింగ్‌ని అతనికి కలిగించలేను కదా! ఒకరితో వాడుకోబడి, తర్వాత వదిలేయబడడంలో వుండే బాధనీ, ఉక్రోషాన్నీ ఎప్పటికీ అతనిలో చూడలేను కదా!"

అక్కడితో ఆగింది ఆ రోజు మా సంభాషణ. తెల్లవారగానే నేను ఇంటికి వచ్చేశాను. అదే చివరిసారి నేను గీతను చూడటం.

రెండ్రోజుల తర్వాత వెళ్తే ఇల్లు తాళం పెట్టి వుంది. పదిరోజుల తర్వాత మళ్ళీ వెళ్తే... "వాళ్ళ మామగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే హడావిడిగా వెళ్ళాం" అని చెప్పింది వాళ్ళ అమ్మ. అంతే. ఆ తర్వాత ఏ సమాచారమూ లేదు.

ఇప్పుడు... దాదాపు సంవత్సరం తర్వాత మళ్ళీ వాళ్ళింటికి వెళ్తే తెలిసిన విషయం ఇదీ. గీత అమెరికా వెళ్ళిందని.

ప్రభుని అంత అసహ్యించుకుని, అంత ద్వేషించి.. మళ్ళీ అంత కామ్‌గా అతని వెనక వెళ్ళడం నాకెందుకో నచ్చలేదు.

"అమెరికా వెళ్ళే మోజులో అన్ని అవమానాలూ మర్చిపోయింది కాబోలు" అనుకున్నాను చిరాకుగా.

నేను కూడా ఇదంతా మర్చిపోవాలని ప్రయత్నించాను. కానీ నా వల్లకాలేదు.

దాని అవమానాన్ని నా అవమానంగా తీసుకున్నానేమో... గీత చెప్పినట్లు ఉపశమనం కోసం మనసు ఆరాటపడేది. రెండేళ్లపాటు ఏ పని చేస్తున్నా ఆ బాధే మనసుని తొలుస్తూ వుండేది.

రెండేళ్ళ తర్వాత... ఒక రోజు అర్ధరాత్రి పన్నెండున్నరకి ఫోన్ మోగింది. రిసీవర్ తీయగానే "శారదా!" అంటూ చిరపరిచితమయిన గొంతు వినిపించింది.

"ఎవరు!" అన్నాను నేను నిద్రమత్తులోనుంచి తేరుకుంటూ. "గీతా!"

"ఊఁ" అంది అది ఆనందం ధ్వనించే గొంతుతో. "ఎలా వున్నావు!"

"నువ్వెలా వున్నావు!" ఉద్వేగంగా అడిగాను.

"బాగున్నాను" స్పష్టంగా వచ్చింది అట్నుంచి సమాధానం. హఠాత్తుగా నాకు నా కోపం గుర్తు రావడంతో ఇంకో ప్రశ్న వేయకుండా మూతి బిగించుకున్నాను.

"బాగున్నాను" అంది అది మళ్ళీ, "ఇక్కడికొచ్చాక ఎమ్.ఎస్. చేశాను. మంచి జాబ్ దొరికింది. నీకు తెలుసా! ఇపుడు నాకు ప్రభు కంటే కూడా ఎక్కువ జీతం. నువ్వు చెప్పినట్లే ఇపుడు నేను చాలా వరకు పనికిరాని ఫీలింగ్స్‌ని వదిలేసుకున్నాను. ప్రభు ఎంత నిర్లక్ష్యంగా వుంటాడో అంతకు రెట్టింపు నిర్లక్ష్యంగా వుంటున్నాను. ఇద్దరం కలిసే వుంటున్నాం. బాబుని ప్రేమగా చూసుకుంటున్నాం. కానీ ఎవరి దారి వారిదే" అది గడగడా చెప్తుంటే మౌనంగా వినసాగాను.

"శారదా! ఇవాళ పొద్దునే తెలిసింది ప్రభుకి. నాకు ఇంక్రిమెంట్ వచ్చిందనీ... తనకన్నా నేను ఎక్కువ శాలరీ డ్రా చేస్తున్నాననీ. చాలా రోజులుగా నా నిర్లక్ష్యాన్ని అనుభవిస్తున్నాడు. బాధ పడ్తున్నాడు. ఈ రోజు శాలరీ సంగతి తెలియగానే ఉక్రోషం పట్టలేకపోయాడు. మొహం అంతా ఎర్రగా చేసుకుని నా ఎదుగుదలని ఎలా ఆపాలో... తను నాకు చేసిన సహాయాన్ని ఎలా వెనక్కి తీసుకోవాలో అర్థంకాక పిచ్చెక్కినట్లుగా అరిచాడు.

"నేను తీసుకువస్తే ఇక్కడికి వచ్చి... నేను తీసుకువస్తే ఇక్కడికి వచ్చి..." అని అతను నిస్సహాయంగా గొణుక్కుంటూ వుంటే... నేను నిర్లక్ష్యంగా నవ్వి, నా కారు స్టార్ట్ చేసుకుని ఆఫీసుకి వచ్చేశాను. ఇప్పుడు అక్కడినుంచే నీకు ఫోన్ చేస్తున్నాను. ఈ రోజు నేను చూశాను శారదా! వాడుకుని వదిలేస్తే కలిగే బాధని ఈరోజు అతని కళ్ళల్లో నేను చూశాను"

అది ఉద్వేగంగా చెప్తుంటే... మూడేళ్ళనుంచీ మండుతున్న నా గుండె చల్లారింది. దాని హృదయంతో పాటూ నా హృదయమూ ఉపశమనం పొందింది. అది సాధించిన విజయానికి నా పెదవులపై చిరునవ్వు మెరిసింది.

<u>రచనాకాలం : 2000</u>